క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పొన్నాడలో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న అధికారులు

కొత్తపల్లి: మండలంలోని పొన్నాడ, శ్రీరాంపురం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను బుధవారం ఎంపీడీఓ వెంకట నారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తున్నట్టు చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, మరుగు దొడ్లు, విద్యుత్ తదితర వసతులు కల్పిస్తున్నట్టు చెప్పారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. ఆయన వెంట మండల విద్యాశాఖ అధికారులు వేణుగోపాల్, పైడిరాజు పాల్గొన్నారు.

దంతాలపై నిర్లక్ష్యం తగదు



సీహెచ్‌సీలో దంత రక్షణ పోస్టర్లు ఆవిష్కరించిన వైద్యులు, సిబ్బంది

సామర్లకోట: దంతాలు ఆరోగ్యంగా ఉంటేనే మనిషి ఆరోగ్యంగా ఉండటానికి అవకాశం ఉంటుందని స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రవీణ అన్నారు. ప్రపంచ దంత ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు అమల ఆధ్వర్యంలో బుధవారం దంత పరిరక్షణపై పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ డెంటల్ స్పెషలిస్టు డాక్టరు ప్రవీణ మాట్లాడుతూ నోటి ఆరోగ్య విషయాలపై శ్రద్ధ చూపాలన్నారు. దంత సమస్యలపై బాధపడుతున్న రోగులకు, గర్భిణులకు ఏమైనా సమస్యలు ఉంటే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో పలువురు దంత రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చంటి పిల్లల వైద్యుడు రమేష్, గైనకాలజిస్టు సంతోషిలక్ష్మి, జనరల్ మెడిసిన్ డాక్టరు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నూకాలమ్మ తల్లికి వాటర్ కూలర్ల సమర్పణ

పెద్దాపురం: కాండ్రకోట నూకాలమ్మ తల్లి ఆలయానికి దాత గుణ్ణం చంద్రమౌళి బుధవారం రెండు కూలింగ్ వాటర్ మెషీన్లు సమర్పించినట్టు ఈఓ టీవీ సూర్యనారాయణ తెలిపారు. త్వరలో జరుగనున్న అమ్మవారి జాతర దృష్ట్యా భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణంలో ఈ మెషీన్లు అందుబాటులో ఉంటాయన్నారు.

20జెపిటి23: ఆలయానికి దాత సమర్పించిన వాటర్ మెషీన్లు

టెన్త్ పరీక్షలకు 20 మంది గైర్హాజరు

కొత్తపల్లి: మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. కాగా బుధవారం నిర్వహించిన ఇంగ్లిషు పరీక్షలకు 20 విద్యార్థులు గైర్హాజరైనట్టు మండల విద్యాశాఖాధికారి వేణుగోపాల్ తెలిపారు. కొత్తపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలోని ఎ సెంటర్ 198లో, బి సెంటర్‌లో 196, వీవీఎస్ విద్యా సంస్థల్లో 225, కొమరగిరి జిల్లా పరిషత్ పాఠశాలలో 220, మూలపేట 205 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని వివరించారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు మౌలిక వసుతులు, వైద్య సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని స్వామి వారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఫాల్గుణ మాసం ఏకాదశి సందర్భంగా తెల్లవారు జామున స్వామి వారికి అభిషేకాలు, పూజలను పిఠాపురం మహారాజా గోత్రనామాలతో చేశారు. ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు స్వామి వారికి పూజలు, అమ్మవారికి కుంకుమార్చనలు, ఉప ఆలయాల్లో పూజలు చేశారు. భక్తులకు అన్నదాన ట్రస్ట్ తరపున అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.

ఓటు విలువను గుర్తిస్తూ..

- వృద్ధులు, దివ్యాంగుల సేవలో ఎన్నికల సంఘం
- హోమ్ ఓటింగ్‌తో ఓటు హక్కు వినియోగం
- దరఖాస్తుల సేకరణలో అధికారులు

పెద్దాపురం: వృద్ధులు, దివ్యాంగుల విలువైన ఓటును స్వీకరించే క్రమంలో ఎన్నికల కమిషన్ ఈ సారి హోమ్ ఓటింగ్ ద్వారా వారి గడపకే రానుంది. ఇందులో భాగంగా నియోజకవర్గంలో దరఖాస్తుల స్వీకరణ మొదలైంది. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే లక్ష్యంతో స్పెషల్ సమ్మరి రివిజన్‌ను పలుమార్లు పొడిగిస్తూ వచ్చింది. ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) నిర్వహిస్తోంది. 85 ఏళ్లు దాటిన వృద్ధులు, అడుగుతీసి అడుగు వేయలేని దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకోవాలంటే నానా యాతనా పడేవారు. ఎన్నికల కేంద్రం వద్ద ర్యాంపులు లేకపోయినా, సరైన వసతులు లేకపోయినా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ సారి వారి వెతలు తీరనున్నాయి. వారి కోసం నూతన మొబైల్ ఓటింగ్ వాహనం వారి ఇంటికి వెళ్లి పోస్టల్ బ్యాలెట్ తరహాలో దరఖాస్తులు స్వీకరిస్తోంది.



గత ఎన్నికల్లో వీల్‌చైర్‌పై వృద్ధురాలిని తీసుకువస్తున్న కుటుంబ సభ్యులు (ఫైల్)

ముందుగానే బీఎల్‌ఓలు గుర్తించి..

ఎన్నికల మార్గదర్శకాల ప్రకారం వృద్ధులు, దివ్యాంగులను బీఎల్‌ఓలు గుర్తించి వారికి ఫారం-12డి ద్వారా ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి (ఈఆర్‌ఓ)కి దరఖాస్తు చేయిస్తున్నారు. వాటిని పరిశీలించిన అనంతరం హోం ఓటింగ్‌కు అర్హులైన వారి జాబితాను రూపొందించి బ్యాలెట్ పేపర్‌పై రహస్యంగా ఓటు వేసే ఏర్పాటు చేస్తారు. ఆ ఓటును సీల్ చేసి తహసీల్దార్ కార్యాలయం ద్వారా రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి తరలిస్తారు. ఈ ప్రక్రియ వీడియో తీస్తారు. కలెక్టర్ ఆదేశాల మేరకు హోం ఓటింగ్ కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. నియోజకవర్గంలో ఈ ప్రక్రియ కోసం పెద్దాపురం ఆర్‌ఓ, ఆర్డీఓ జేఎస్ రామారావు పారదర్శకంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

నియోజకవర్గంలో ఓటర్ల వివరాలు...

మొత్తం పోలింగ్ కేంద్రాలు	: 200
మొత్తం ఓటర్లు	: 2,12,579
పురుషులు	: 1,04,611
స్త్రీలు	: 1,07,956
ఇతరులు	: 12
సెగ్మెంట్‌లో వయో వృద్ధులు, దివ్యాంగ ఓటర్లు	
దివ్యాంగులు	: 3009
85 ఏళ్లు పైబడిన వారు	: 938

వృద్ధులకు ప్రయోజనం



నా లాంటి వారికి ఇది చాలా ఉపయోగం. దివ్యాంగ సర్టిఫికెట్ లేని కారణంగా బూత్ వద్దకు ఆటోలో రమ్మంటున్నా నడవలేక ఇబ్బంది పడుతున్నాను. ఈసీ తీసుకున్న ఈ నూతన విధానం ఎంతో ప్రయోజన కరం

– పోలవరపు లక్ష్మి, చదలాడ, పెద్దాపురం మండలం

ఓటుహక్కుతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ



18 ఏళ్లు నిండిన వారితో ఓటు హక్కు నమోదయ్యేలా చూసుకోవాలి. ఎన్నికల సంఘం తీసుకువచ్చిన హోమ్ ఓటింగ్ (ఇంటి నుంచే ఓటు)ను వయో వృద్ధులు, దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలి.

– జె.సీతా రామారావు, ఆర్‌ఓ, పెద్దాపురం

కల్యాణం.. కమనీయం

- వైభవంగా స్వామివార్ల కల్యాణోత్సవాలు
- వీక్షించిన భక్తులు

పిఠాపురం: పట్టణంలో వేంచేసిన పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి వారి వార్షిక కల్యాణం బుధవారం కనులవైకుంఠంగా జరిగింది. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం పండితులు స్వామివారికి ధ్వజారోహణం, ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు పి.రామకృష్ణమాచార్యులు, పి.నరసింహాచార్యులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కొండెవరంలో...

కొత్తపల్లి: మండలంలోని కొండెవరంలో వేంచేసిని పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి దివ్య కల్యాణ మహోత్సవం బుధవారం రాత్రి కన్నులపండువగా జరిగింది. పండితులు ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఘనంగా ఊరేగించారు. రాత్రికి భక్తుల నడుమ స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. స్వామివారి కల్యాణాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

నేడు ఆహ్వాన నాటిక పోటీలు

స్వామివారి కల్యాణోత్సవాలను పురస్కరించుకుని గురువారం బాలబాలికల ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 24వ తేదీ వరకూ ఈ పోటీలు జరుగుతాయన్నారు. 21న కొండెవరం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులతో మన ఓటే శాసనం, వెలుగు-చీకటి, 22న భారతి పాఠశాల విద్యార్థులతో బరువెక్కిన గుండెలు, 23న వీవీఎస్ పాఠశాల విద్యార్థులతో అత్తా కోడళ్లు, తామరాడ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులతో కనువిప్పు, 24న సాంస్కృతిక కార్యాక్రమాలు, బహుమతుల ప్రదానం నిర్వహించనున్నట్లు కళా పరిషత్ చైర్మన్ మేడిశెట్టి శ్రీరాములు వివరించారు.



పిఠాపురంలో వేంకటేశ్వరస్వామి కల్యాణం జరిపిస్తున్న పండితులు

మూలపేటలో జగన్నాథస్వామి, సత్యనారాయణస్వామి వార్ల కల్యాణం

కొత్తపల్లి: మండలంలోని మూలపేటలో వేంచేసిన బలభద్ర, సుభద్రా సమేత జగన్నాథస్వామి, సత్యనారాయణస్వామి వార్ల కల్యాణం బుధవారం రాత్రి వైభవంగా జరిగింది. జగన్నాథస్వామి, సత్యనారాయణస్వామి వార్ల కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఉదయం అంకురార్పణ, ధ్వజారోహణం, అగ్నిప్రతిష్ఠాపన, సహస్రనామార్చన, సహస్ర కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం సామి వార్లకు గరుడ, గజవాహనాలపై గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రికి వేదపండితులు స్వామివార్ల కల్యాణ క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివార్ల కల్యాణాన్ని వీక్షించారు.



స్వామివారి కల్యాణం తిలకిస్తున్న భక్తులు



కొండెవరంలో వేంకటేశ్వరస్వామి కల్యాణం జరిపిస్తున్న పండితులు



మూలపేటలో జగన్నాథుడు, సత్యదేవుని కల్యాణం జరిపిస్తున్న పండితులు

కుండపోత వర్షం

- సేద తీరిన ప్రజలు
- వరికి నష్టం లేదన్న అధికారులు

సామర్లకోట: కుండపోతగా వర్షం కురియడంతో బుధవారం పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. గత మూడు రోజులుగా వాతావరణం చల్లగా ఉంది. ముందు జాగ్రత్త చర్యగా ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. సుమారు గంటపాటు కుంభవృష్టి కురవడంతో స్థానిక బస్సు కాంప్లెక్స్, స్టేషన్ సెంటర్, జయలక్ష్మి థియేటర్ రోడ్డు, పెద్దాపురం రోడ్డు, అయోధ్యరామపురం రోడ్డు, బలుసులపేట, భాస్కర్‌నగర్, క్వారీ గోతులు, దేవీచౌక్ రోడ్లు నీటితో నిండిపోయాయి. బుధవారం కురిసిన వర్షానికి వరి పంటకు ఏమాత్రం నష్టం లేదని మండల వ్యవసాయాధికారి ఐ.సత్య తెలిపారు. నీటి ఎద్దడి ఉన్న గోదావరి కాలువ ఆయకట్టు శివారు భూములకు మెట్ట ప్రాంతంలోని పంటలకు వర్షం మేలు చేస్తుందని ఆమె చెప్పారు.

కొత్తపల్లి: మండల వ్యాప్తంగా బుధవారం భారీ వర్షం కురిసింది. రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలు ప్రాంతాల్లో ప్రధాన రహదారులపై నీరు నిలిచిపోయింది. ఉప్పాడ బీచ్‌రోడ్డు సెంటర్‌లో రహదారికి ఇరువైపులా డ్రైన్‌ను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జాగ్రత్తలు పాటించాలి. ఈ వర్షం మామిడి, జీడి మామిడి పంటలకు నష్టం కలిగిస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

కొత్తపల్లి: ప్రస్తుతం వాతావరణ మార్పుల కారణంగా వ్యాప్తి చెందుతున్న జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సౌజన్య సూచించారు. గ్రామాల్లో ప్రజలు ఫ్లూ జ్వరాలు, జలుబు, దగ్గు వంటి సీజనల్ వ్యాధులతో బాధపడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జ్వరం, రొంప, దగ్గు వంటి లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలని సూచించారు.



జలమయమైన సామర్లకోట బస్ కాంప్లెక్స్ ఆవరణ



వర్షంతో నిండిన అయోధ్యరామపురం రోడ్డులో నడిచి వస్తున్న విద్యార్థులు



కొత్తపల్లిలో కురుస్తున్న వర్షం

విద్యుత్ సమస్యల పరిష్కారానికి నేడు సదస్సు

పిఠాపురం: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి గురువారం పిఠాపురం విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద న్యాయ సదస్సు నిర్వహించనున్నట్టు ఏడీఏ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. ఈ సదస్సుకు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం చైర్మన్‌తో పాటు ముగ్గురు కమిటీ సభ్యులు హాజరవుతారన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఈ సదస్సు జరుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులకు ఎటువంటి సమస్యలు ఉన్నా ఇక్కడ ఫిర్యాదు చేస్తే వాటికి వారం రోజుల్లో పరిష్కారం చూపిస్తారన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

23న రక్తదాన శిబిరం

సామర్లకోట: భగత్‌సింగ్ రాజ్‌గురు సుఖ్‌దేవ్ వర్ధంతిని పురస్కరించుకొని ఈనెల 23వ తేదిన రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు స్థానిక భగత్‌సింగ్ విజ్ఞాన కేంద్రం అధ్యక్ష, కార్యదర్శులు బాలం హరి, చల్లా మహేష్ తెలిపారు. బుధవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ సకాలంలో రక్తం అందక ప్రాణాలు కోల్పోతున్న వారి కోసం ఈ శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి శిబిరం ప్రారంభం అవుతుందన్నారు. రక్తదానం చేసే యువత ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు.

వైఎస్సార్ సీపీ విజయం తథ్యం

- ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు సునీల్, దొరబాబు

పెద్దాపురం: మంచి మనసుతో రాష్ట్రంలో సుపరిపాలన సాగించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పుడూ దేవుని ఆశీస్సులుంటాయని, కనకదుర్గ ఆశీస్సులతో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం తథ్యమని కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, పెద్దాపురం ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని వడ్లమూరు గ్రామంలోని నూతన కనకదర్గ ఆలయంలో బుధవారం సాయంత్రం వారు ప్రత్యేక పూజలు చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ అన్నదానాన్ని వారు ప్రారంభించారు. సునీల్, దొరబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు మెరుగైన సేవలందించిన సీఎం జగన్ అమలు చేసిన ప్రజా సంక్షేమ పథకాలను గుర్తించుకోవాలన్నారు. ప్రజా సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరో దఫా వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. అనంతరం భక్తులతో సహపంక్తి భోజనాలు చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, మండల కన్వీనర్ గోపు మురళి, ఎలిశెట్టి నరేష్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



దుర్గమ్మ ఆలయం వద్ద భక్తులతో కలిసి వస్తున్న దొరబాబు, సునీల్

సీనియర్ నాయకులను కలిసిన దొరబాబు



గోలి వెంకట అప్పారావు, కాళ్ల లక్ష్మీనారాయణలను సునీల్‌కు పరిచయం చేసిన దవులూరి

సామర్లకోట: రాష్ట్ర ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ సీపీ పెద్దాపురం అభ్యర్థిగా దవులూరి దొరబాబును ప్రకటించడంతో బుధవారం సీనియర్ నాయకులను, కార్యకర్తలను కలుసుకున్నారు. దాంతో సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకులు స్థానికునికే మా మద్దతు, విజయమే లక్ష్యం అంటూ ఆయనకు హామీ ఇచ్చారు. మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ గోలి వెంకట అప్పారావుచౌదరి, మాజీ కౌన్సిలర్ కాళ్ల లక్ష్మీనారాయణ, భారత మాత సేవా పరిషత్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గొరకపూడి చిన్నయ్యదొర చేయిచేయి కలిసి స్థానిక అభ్యర్థి దొరబాబును గెలిపిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా దొరబాబు వారిని కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ వద్దకు తీసుకువెళ్లారు. సునీల్ వారిని అభినందించారు. అదే విధంగా పార్టీ కౌన్సిలర్ కరణం రాజ్ కుమార్, పార్టీ నాయకులు కరణం భాను, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కానుబోయిన విజయ కృష్ణలను కలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు మద్దాలి శ్రీను, వర్కింగ్ కమిటీ చైర్మన్ పాగా సురేష్ కుమార్, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ గుణ్ణం రాజబ్బాయి, మాజీ కౌన్సిలర్ మన్యం చంద్రరావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఊబా జాన్‌మోజెస్, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి జానీ మోజెస్, పలువురు కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో తనిఖీలు



ఉప్పాడ భవిత కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న సర్వశిక్షాభియాన్ సీఎంఓ నాగేశ్వరరావు

కొత్తపల్లి: ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు (దివ్యాంగులు) ప్రభుత్వం అన్నిరకాల వసతులు కల్పిస్తోందని సమగ్ర శిక్షా అభియాన్ కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి, ఇంక్లూజివ్ ఎడ్యుకేషనల్ కో ఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని ఉప్పాడ భవిత కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న వసతులపై ఆరా తీశారు. అనంతరం మండల విద్యాశాఖ కార్యాలయాన్ని పరిశీలించారు. మండలానికి వచ్చిన జగనన్న విద్యా కానుక కిట్ల వివరాలను ఎంఈఓలు వేణుగోపాల్, పైడిరాజులను అడిగి తెలుసుకున్నారు.

ఇంగ్లిషు పరీక్షకు 37 మంది గైర్హాజరు

సామర్లకోట: పదో తరగతి పరీక్షల్లో భాగంగా మూడో రోజు ఇంగ్లిషు పరీక్షకు 37 మంది గైర్హాజరైనట్టు ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మండల పరిధిలోని 9 పరీక్షా కేంద్రాల్లో 1586 మంది రెగ్యులర్, 36 మంది ప్రైవేటు విద్యార్థులు ఇంగ్లీషు పరీక్ష రాయాల్సి ఉండగా, రెగ్యూలర్ 11 మంది, ప్రైవేటు విద్యార్థులు 26 మంది గైర్హాజరైనట్టు తెలిపారు.

సారా విక్రయిస్తున్న ఇద్దరి మహిళల అరెస్టు

ప్రత్తిపాడు రూరల్: సారా విక్రయిస్తున్న ఇద్దరు మహిళలను అరెస్టు చేసినట్లు ప్రత్తిపాడు ఎస్‌ఈబీ సీఐ ఎల్.చిరంజీవి తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ప్రత్తిపాడు ఎస్‌ఈబీ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో బుధవారం అధికారులు దాడులు నిర్వహించారు. ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెంలో ఐదు లీటర్ల సారాతో రాళ్ల దుర్గ, కిర్లంపూడి మండలం గోనేడలో ఐదు లీటర్ల సారాతో కర్రి శ్రీలక్ష్మిలను అరెస్టు చేశారు. ప్రత్తిపాడు మండలం వేములపాలెంలో 1600 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసి 40 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ వివరించారు. ఈ ఘటనలో అదే గ్రామానికి చెందిన తుట్టా అప్పలరాజు పరారీ కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎస్‌ఈబీ ఎస్సై ఎం.ఆశాలత, హెడ్ కానిస్టేబుల్స్ వెంకన్న దొర, కృష్ణార్జునరావు, కానిస్టేబుళ్లు దొరబాబు, రాజు, రాంబాబు, వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.